మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట
వార్త



## భూ సమస్యల పరిష్కారమే భూ భారతి లక్ష్యం

### సిద్దిపేట జిల్లా కలెక్టర్ మనుచౌదరి

చేర్యాల/ధూళిమిట్ట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త : భూ సమస్యల పరిష్కరమే లక్ష్యంగా భూ భారతి చట్టన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిందని భూ భారతి చట్టంపై రైతులు అవగహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ మను చౌదరి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ధూళిమిట్టతోపాటు చేర్యాల పట్టణంలోని రైతు వేదికలో భూ భారతి(అర్ఒఅర్) చట్టం 2025పై అవగహన సదస్సులు నిర్వహించి రైతుల సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమం లో కలెక్టర్ (రెవెన్యూ) అర్డిఒలతో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. భూసమస్యల పరిష్కారంతోపాటు ధరణికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం ఈ చట్టన్ని తీసుకొచ్చిందన్నారు. ఎలాంటి భూ సమస్యలున్న దరఖాస్తు చేసుకొని తహాసీల్దార్, అర్డిఒ, కలెక్టర్ స్థాయిలోనే సమస్యలను పరిష్కరించుకొవచ్చునన్నారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

## న్యాల్‌కల్‌లో గాలివాన బీభత్సం

**న్యాల్‌కల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో శుక్రవారం మధ్యాహ్నం వీచిని గాలి దుమారినికి గ్రామం అతలాకుతలం అయింది. మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా ఈదురు గాలులు వీస్తూ వాన దంచి కొట్టడంతో విద్యుత్ స్థంభాలు నేలకొరిగాయి. దీంతో గ్రామంలో విద్యుత్ సరఫరాను నిలిపివేశారు. రైతులు సాగు చేసుకుంటున్న పంటలు, మామిడి కాయలు రాలిపోవడంతో అన్నదాతల పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.





ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న హరీష్‌రావు

## ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వ నిర్లక్ష్యం

### మాజీ మంత్రి,ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు

నంగునూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త : ధాన్యం కొనుగోళ్లలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు అన్నారు. శుక్రవారం మండలంలోని పాలమాకుల గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా వడ్ల కొనుగోళ్లు, అక్కడ ఉన్న సౌకర్యాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగానే రైతులు ధాన్యాన్ని దళారులకు అమ్ముకుంటూ ఆర్థికంగా నష్టపోతున్నారన్నారు. ఖమ్మం, నల్గొండ, సూర్యపేట జిల్లాలలో ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయక పోవడం బాధాకరమన్నారు.రాష్ట్ర వ్యాప్తంగా అకాలవర్షాలకు నష్టపోయిన రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

## కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షుడు, టిపిసిసి సభ్యుడు చంద్రం



మంత్రి పొన్నంను సన్మానిస్తున్న చంద్రం

**సిద్దిపేట అర్బన్, ఏప్రిల్ 25,ప్రభాతవార్త :** కార్మికుల సంక్షేమానికి కాంగ్రెస్ సర్కారు కట్టుబడి పనిచేస్తుందని బిఎన్ఆర్‌కెఎస్ రాష్ట్ర అధ్యక్షులు, టిపిసిసి సభ్యులు దరిపల్లి చంద్రం అన్నారు. శుక్రవారం సిద్దిపేటలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మే డే సందర్భంగా సిద్దిపేట పట్టణంలోని కొండ భూదేవి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించే కార్మికుల సమావేశానికి రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను హైదారాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించి ఆహ్వానించినట్లు తెలిపారు. మే డే సందర్భంగా నిర్వహించే సమావేశానికి కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలన్నారు. గత బిఆర్ఎస్ సర్కారు కార్మికుల సమస్యలను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. కాంగ్రెస్ సర్కారు హయాంలో సిఎం రేవంత్‌రెడ్డి కార్మికుల సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. సమావేశంలో బిఎన్ఆర్‌కెఎస్ నాయకులు శ్రీశైలం,కిషన్, సెల్మెడ రాములు, కొమురయ్య, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు. ఫోటోరైటప్ హుస్నాబాద్ 07.కళాశాల ఏర్పాటుకు స్థలం పరిశీలిస్తున్న గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి, జిల్లా కలెక్టర్

## గురుకుల వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు రూ.100 కోట్లు మంజూరు



స్థలాన్ని పరిశీలిస్తున్న గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి,జిల్లా కలెక్టర్

**బెజ్జంకి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండలంలోని తోటపల్లి గ్రామంలో సాంఘిక సంక్షేమ గురుకుల వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు ప్రభుత్వం రూ.100 కోట్లు మంజూరు చేసిందని గురుకుల విద్యా సంస్థల కార్యదర్శి అలుగు వర్షిని తెలిపారు. శుక్రవారం మండలంలోని తోటపల్లి గ్రామంలో కళాశాల ఏర్పాటుచేసేందుకు స్థలాన్ని జిల్లా కలెక్టర్ మిక్కిలినేని మనుచౌదరి, ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాసంస్థల ద్వార తోటపల్లిలో 100 కోట్లతో నిర్మించబోతున్నామని, స్థానిక ఎమ్మెల్యే చొరవతో స్థల పరిశీలన కూడా పూర్తి చేశామన్నారు. పదిహేను రోజుల్లో స్థలాన్ని స్వాదీనం చేసుకుని మొదటి విడతగా 47కోట్లతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయనున్నట్లు ప్రకటించారు. నిర్మించబోయే కళాశాలను అత్యాధునిక టెక్నాలజీతో నిర్మిస్తామన్నారు. ఈ కళాశాలలో గిరిజన గురుకుల పాఠశాలల్లో చదివిన విద్యార్థులకు 75శాతం సీట్లు కేటాయించడం జరుగుతుందన్నారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ నియోజకవర్గంలో కళాశాల ఏర్పాటుకు సహకరిస్తున్న ప్రభుత్వంతో పాటు గురుకుల విద్యాసంస్థల కార్యదర్శి,జిల్లా కలెక్టర్‌లకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

### అదనపు జిల్లా కలెక్టర్ నగేష్

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 25 ప్రభాతవార్త:** ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి మెదక్ జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ పిలుపునిచ్చారు. కొంటూరు, రాజ్‌పల్లి, బాలానగర్ ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించి, కలెక్టరేట్ కార్యాలయంలో అధికారులతో సమీక్ష రైతులు తమ ధాన్యాన్ని శుభ్రంగా తీసుకువచ్చి, మద్దతు ధర పొందాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కన్స్యూమర్ ఫుడ్ అండ్ సివిల్ సప్లై జాయింట్ సెక్రెటరీ ప్రియాంక తెలిపారు. శుక్రవారం మెదక్‌జిల్లా పర్యటనలో భాగంగా ఆమె అదనపు కలెక్టర్ నగేష్‌తో కలిసి కోమటూరు, రాజుపల్లి, బాలనగర్ కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం కలెక్టరేట్ కార్యాలయంలో డిఆర్డిఒ, సివిల్ సప్లై, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులతో జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ పై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోళ్ల వేగంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్, ఆదేశాల అనుసరిస్తూ సివిల్ సప్లై యంత్రాంగం మెదక్ జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సమర్ధవంతంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లలు చేసినట్లు తెలిపారు. సమావేశంలో ఫుడ్ అండ్ సివిల్ సప్లై జాయింట్ సెక్రెటరీ ప్రియాంక ఆల, డిఆర్డిఎ పిడి శ్రీనివాసరావు, డి ఎం సివిల్ సప్లై సురేష్ రెడ్డి, పౌరసరఫరాల శాఖ. మేనేజర్ జగదీష్, డిసిఒ కరుణాకర్, సంబంధిత వ్యవసాయ మార్కెటింగ్ అధికారులు పాల్గొన్నారు.

# భూభారతితో భూ సమస్యలు పరిష్కారం

### సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి




మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

**సిర్గాపూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** భూభారతితో రైతులు నిర్ణీత గడువులోపు భూ సమస్యలను పరిష్కరించుకోవచ్చని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. గురువారం సిర్గాపూర్‌లో ఏర్పాటు చేసిన భూభారతిపై అవగాహన సదస్సు కార్యక్రమానికి కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై రైతులకు భూభారతి చట్టంపై అవగాహన కల్పించారు. ధరణి రికార్డులను భూభారతిలో నమోదు చేయడం జరుగుతుందన్నారు.భూ రికార్డుల్లో తప్పులు ఉంటే చట్టం అమలులోకి వచ్చిన ఏడాది కాలంలోపు దరఖాస్తు చేసుకోవాలన్నారు. అధికారులు గ్రామాలకు చేరుకుని అర్జీలు స్వీకరించి నిబంధనలకు అనుగుణంగా తప్పులను సవరిస్తారన్నారు. అప్పీలు చేసుకున్న సన్న, చిన్నకారు, పేద రైతులకు ఉచిత న్యాయ సహాయం అందిస్తారని వివరించారు. భవిష్యత్తులో ఎలాంటి వివదాలకు ఆస్కారం లేకుండా పట్టాపాస్ బుక్కులలో సమగ్ర వివరాలతో హద్దులను పేర్కొంటూ భూమి పటం (మ్యాప్) పొందుపరుస్తారన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేయడానికి ముందు సర్వే మ్యాప్ రూపొందించి పట్టా పాస్‌బుక్కును జతపరుస్తారని పేర్కొన్నారు. ఆధార్ తరహాలోనే భూముల వివరాలతో కూడిన భూధార్ నంబరును కేటాయిస్తారని వివరించారు. చట్టంలో ఇంటి స్థలాలకు, ఆబాది, వ్యవసాయేతర భూములకు సైతం హక్కుల రికార్డు ఉంటుందన్నారు. మోసపూరితంగా హక్కుల రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ భూధాన్, అసైన్డ్, దేవాదాయ, వక్ఫ్ భూములకు పట్టాలు పొందితే పట్టాలను రద్దు చేసే అధికారం భూభారతి ద్వారా అధికారులకు కల్పించినట్లు పేర్కొన్నారు. ధరణిలో కొన్ని భూసమస్యల పరిష్కారానికి అవకాశం ఉండేది కాదని, అభ్యంతరాలు ఉంటే సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి ఉండేదని, భూభారతితో తహసీల్దార్, ఆర్‌డిఓలకు ధరఖాస్తులు చేసుకుని సమస్యలను పరిష్కరించుకోవచ్చన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను ఆర్డీఓ పరిశీలించి క్రమబద్ధీకరిస్తారని తెలిపారు.

ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి మాట్లాడుతూ భూభారతి చట్టంతో అసైన్‌మెంట్ కమిటీల పునురుద్దరణ చేశారని, గత బిఆర్ఎస్ ప్రభుత్వం భూ చట్టాల్లో అనేక అక్రమాలకు పాల్పడిందని ఆరోపించారు. నియోజకవర్గంలో రూ. 32 కోట్ల రుణమాఫీ జరిగిందని,తాగునీరు అందించిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కుతుందన్నారు.

# కేసుల నమోదులో జాప్యం చేయవద్దు

### సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధరెడ్డి



మాట్లాడుతున్న పోలీస్ కమిషనర్ అనురాధరెడ్డి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ పరిధిలో కేసుల నమోదులో అధికారులు జాప్యం చేయవద్దని పోలీస్ కమిషనర్ అనురాధరెడ్డి అన్నారు. శుక్రవారం కమిషనర్ కార్యాలయంలో హుస్నాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో పెండింగ్‌లో ఉన్న కేసులపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా 2024, 2025 సంవత్సరాలకు సంబంధించిన అండర్ ఇన్విస్టిగేషన్ కేసులలో గ్రేవ్, నాన్ గ్రేవ్ కేసుల గురించి ఏసిపిలు, సిఐలు, ఎస్ఐలను అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ సిసిటిఎస్ ప్రకారం క్రైమ్ రివ్యూ సమావేశాలు జరుగుతున్నాయని కావున ప్రతీ పోలీస్ స్టేషన్‌లో డాటాను ఇందులో పొందుపరచాలన్నారు. నూతన టెక్నాలజీని అధికారులు ఉపయోగించుకోవడం నేర్చుకోవాలన్నారు. స్టేషన్‌కు వచ్చే ప్రతీ ఫిర్యాదు స్వీకరించడంతోపాటు సమగ్ర విచారణ జరిపి త్వరగా కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కేసుల విషయంలో నిర్లక్ష్యం వహించే అధికారుల పట్ల కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రతీ పోలీస్ స్టేషన్ పరిధిలో వేసవి కాలం దృష్ట్యా పెట్రోలింగ్, బ్లూకోర్ట్స్ రాత్రి సమయంలో ఎక్కువ చేయాలని, సస్పెక్ట్, రౌడీ, కెడిలను తనిఖీలు చేయడంతో పాటు వారిపై నిఘా ఉంచాలన్నారు. సిటిజన్ ఫీడ్ బ్యాక్ లాంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని, సిసి కెమోరాల వల్ల కలిగే లాభాలను ప్రజలకు వివరించాలన్నారు. రోడ్లపై రైతులు ధాన్యం ఆరబోయకుండా చూసుకోవాలన్నారు. గ్రామాలు, పట్టణాలలో డ్రగ్స్, సైబర్ నేరాలపై, ఆత్మహత్యలపై అవగాహన కల్పించాలన్నారు. ఎస్‌వోపిల ద్వారా కేసుల పరిశోదన ఉండాలని, ప్రతి కేసులో పరిశోధన పారదర్శకంగా ఉండాలన్నారు. ఫోక్సో, క్రైమ్ అగ్నెస్ట్ ఉమెన్ కేసులలో దోషులకు వెంటనే శిక్షపడేలా చూడాలన్నారు. గంజాయి, మత్తుపదార్థాలపై ఉక్కుపాదం మోపాలని బ్లూకోర్ట్స్, పెట్రోలింగ్ సిబ్బంది నిరంతరాయంగా విధుల్లో ఉండాలన్నారు. 100 డయల్ రాగానే రెస్పాండ్ అవ్వాలని సాధ్యమైనంత త్వరగా సంఘటన స్థలాల వద్దకు చేరుకోవాలన్నారు. సమావేశంలో హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్, సిఐ కొండ్ర శ్రీనివాస్, చేర్యాల సిఐ శ్రీనివాస్, సిసిఆర్బి ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, ఉటి సెల్ ఇన్‌స్పెక్టర్ శ్రీధర్, ఏవో యాదమ్మ, సూపరింటెండెంట్ ఫయాజుద్దిన్, హుస్నాబాద్ డివిజన్ ఎస్ఐలు తోట మహేష్, అభిలాష్, విజయ్‌భాస్కర్, నిరేష్, షేక్ మహబూబ్, రాజు, కోర్టు మానిటరింగ్ ఎస్ఐ రాజేష్ తదితరులు ఉన్నారు.

## మెదక్‌లోని గ్రంథాలయంలో నూతన డిజిటల్ లైబ్రరీ ప్రారంభం



డిజిటల్ గ్రంథాలయాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్, గ్రంథాలయ చైర్మన్

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 25, ప్రభాతవార :** డిజిటల్ లైబ్రరీని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మెదక్ జిల్లా కేంద్రంలో గ్రంథాలయంలో నూతన డిజిటల్ లైబ్రరీని విభాగాన్ని జిల్లా కలెక్టర్ గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డితో కలిసి ప్రారంభించారు. లైబ్రరీని పరిశీలించి ఇంటర్నెట్ సౌకర్యం, వసతులు గురించి ఆరా తీశారు. కలెక్టర్ స్వయంగా కంప్యూటర్ ఆన్ చేసి ఇంటర్నెట్ వసతిని పరిశీలించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ డిజిటల్ లైబ్రరీని ప్రారంభించడం ద్వారా, ప్రజలకు సమాచారం మరియు విద్యా వనరులను అందించడం ద్వారా, వారి జ్ఞానాన్ని పెంచడానికి సహాయపడుతుంది. పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్నా విద్యార్థులు, నిరుద్యోగ యువత కోసం ఇంటర్నెట్ సేవలతో కూడిన డిజిటల్ లైబ్రరీకి పది కంప్యూటర్లతో డిజిటల్ లైబ్రరీని నెలకొల్పామన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ చిలుమల సుహాసిని రెడ్డి మాట్లాడుతూ మెదక్ జిల్లా గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలుగా తీర్చిదిద్దుతున్నట్లు విద్యార్థులు, నిరుద్యోగ యువతకు అవసరమైన మరిన్ని బుక్స్, జర్నల్స్ ను సమకూర్చడంతో.యువతీ యువకులు పోటీ పరీక్షలలో ప్రతిభను చాటి వివిధ శాఖలలో ప్రభుత్వ కొలువులు సాధిస్తున్నట్లు వివరించారు. రానున్న రోజుల్లో గ్రంథాలయాలు మరింత అభివృద్ధి చేసే దిశగా కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సెక్రెటరీ వంశీకృష్ణ, సిబ్బంది నరేందర్ రెడ్డి, శంకర్, యాదగిరి, మురళి, ఉమాదేవి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా శ్రీసీతారామ ఉమామహేశ్వరుల పుష్ప రథోత్సవం



శ్రీ వెంకటేశ్వరాలయం బ్రహ్మోత్సవాల్లో పాల్గొన్న హరీష్‌రావు

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** పట్టణంలోని శ్రీసీతారామ ఉమామహేశ్వర ఆలయ బ్రహ్మోత్సవాలు ఐదురోజులుగా వైభవంగా జరుగుతున్నాయి. బ్రహ్మోత్సవాల్లో చివరి రోజు అయిన శుక్రవారం వివిధ రకాల పూలతో అందంగా అలంకరించిన రథంపై స్వామివారలను అధిష్టింపజేసి శ్రీ సీతారామ ఉమామహేశ్వర ఆలయం నుండి అంగడిపేట హనుమాన్ దేవాలయంవరకు రథోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గజ్వేల్ పట్టణంతోపాటు వివిధ గ్రామాలనుండి తరలివచ్చిన భక్తులు స్వామివారలను దర్శించుకొని హారతులు ఇచ్చి కొబ్బరికాయలు కొట్టారు. పుష్పరథోత్సవం ముందు మహిళలు కోలాటం ఆడగా డప్పుచప్పుళ్ల మధ్య భక్తులు జై శ్రీరామ్ అంటూ భజనలు చేస్తూ రథంను ముందుకు లాగడం జరిగింది. ఉదయం 10గంటలకు ప్రారంభమైన రథోత్సవం హనుమాన్ దేవాలయం వరకు చేరుకొని తిరిగి మధ్యాహ్నం 2 గంటలకు శ్రీసీతారామ ఉమామహేశ్వరాలయంకు చేరుకుంది.భక్తులకు పలువురు అల్పాహారం, మజ్జిగ పంపిణీ చేయడం జరిగింది.

### ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరం
### -మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు

ప్రతి ఒక్కరిలో ఆధ్యాత్మిక చింతన అవసరమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్ పట్టణంలో జరిగిన శ్రీసీతారామ ఉమామహేశ్వరుల పుష్పరథోత్సవ కార్యక్రమంలో వారు పాల్గొని స్వామివారలను దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పట్టణంలోని శ్రీలక్ష్మి వెంకటేశ్వరాలయం లో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావుకు ఆలయ నిర్వాహకులు, అర్చకులు ఘన స్వాగతం పలికి తీర్థప్రసాదాలు అందజేసి శేష వస్త్రంతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, మాజీ వైస్ చైర్మన్ జకియొద్దీన్, పిఎసిఎస్ చైర్మన్ వెంకట్‌గౌడ్, ఏఎంసి మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ ఉడెం కృష్ణారెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీనివాస్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి, బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు కళ్యాణ్‌కార్ నర్సింగరావు, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా పాల్గొన్నారు.



సిపికి పుష్పగుచ్చం అందిస్తున్న దృశ్యం

## పదోన్నతులు బాధ్యతలు పెంచుతాయి

### సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధరెడ్డి

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

పదోన్నతులు పోలీసులకు మరింత బాధ్యతలను పెంచుతాయని సిద్దిపేట పోలీస్ కమిషనర్ అనురాధరెడ్డి అన్నారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో హుస్నాబాద్ హెడ్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న బి.సంపత్‌రెడ్డితో పాటు బెజ్జంకిలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న మహ్మద్ మక్సుద్ అలీ, చిన్నకోడూర్ పోలీస్ స్టేషనలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న డి.సంపత్‌కుమార్‌లు ఏఎస్ఐలుగా పదోన్నతులు పొందగా కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిపి మాట్లాడుతూ పదోన్నతి పొందిన అధికారులు రెట్టింపు ఉత్సాహంతో పని చేయాలన్నారు. కార్యక్రమంలో సిద్దిపేట ఏసిపి మధు,హుస్నాబాద్ ఏసిపి వాసాల సతీష్, టాస్క్‌ఫోర్స్ ఎసిపి రవీందర్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడే రవీందర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

## పాదయాత్రను ప్రారంభించిన హరీష్‌రావు

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



పాదయాత్రను జెండా ఊపి ప్రారంభిస్తున్న హరీష్‌రావు

సిద్దిపేట నుంచి విద్యార్థి యువజన విభాగం ఆధ్వర్యంలో బయలుదేరిన పాదయాత్ర రేపటి బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రావడానికి విజయయాత్రగా కాబోతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు అన్నారు. నాడు సిద్దిపేట నుంచే కెసిఆర్ సైకిల్ యాత్ర చేపట్టి వరంగల్ సభకు ఊళ్లకు ఊళ్ల కదిలించారని తెలిపారు. జిల్లా కేంద్రంలోని రంగధాంపల్లి చౌరస్తా అమరవీరుల స్థూపం వద్ద అమరవీరులకు నివాళులర్పించి ఈనెల 27న ఎల్కతుర్తిలో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ సభకు వెయ్యి మందితో తరలివెళ్తున్న విద్యార్థి యువజన విభాగం పాదయాత్రను శుక్రవారం ఆయన జెండా ఊపి ప్రారంభించారు. 25 యేండ్ల పార్టీ ఆవిర్భావం సందర్భంగా 25 మీటర్ల జెండా పై బిఆర్ఎస్ హయాంలో కెసిఆర్ ప్రవేశపెట్టిన పథకాలు, హరీష్‌రావు సిద్దిపేట నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిపై ప్రదర్శన నిర్వహించారు. అనంతరం హరీష్‌రావు మాట్లాడుతూ కెసిఆర్ అనే ఒక గొంతు కోట్ల గొంతుకలను ఏకం చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను ఎదిరించడానికి ఈ గులాబీ దండు కదులుతుందన్నారు. బిఆర్ఎస్ హయాంలో సిఎం కెసిఆర్ నఅమలు చేసిన అనేక పథకాలు దేశానికే ఆదర్శంగా నిలిచయన్నారు. కాంగ్రెస్ పార్టీ 420 హామీలు ఇచ్చి అధికారంలోకి రాగానే అమలు చేయకుండా మోసం చేస్తుందన్నారు. ఓడినా గెలిచినా ప్రజల పక్షాన ప్రజల మధ్యలో ఉండి కొట్లాడే పార్టీ బిఆర్ఎస్ పార్టీ అన్నారు.పాదయాత్రలో కాంగ్రెస్ సర్కారు చేస్తున్న మోసాలను ప్రజలకు వివరించాలన్నారు.కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు కొండం సంపత్‌రెడ్డి, పూజల చిన్నా, తిరుమల్‌రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ శ్రేణులు తదితరులు పాల్గొన్నారు.

## కొంగోడులో దంచికొట్టిన వర్షం

**కొల్చారం, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** మండల పరిధిలోని కొంగోడు గ్రామంలో శుక్రవారం సాయంత్రం వాన దంచి కొట్టింది. గాలి దుమారంతో భారీ వర్షం కురిసింది. దీంతో కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం తడిసి ముద్దయ్యాయి. అమ్మ కానికి తెచ్చిన ధాన్యం వర్షానికి తడిసి పోవడంతో అన్నదాతల పరిస్థితి ఆగం ఆగం అయింది.



కొంగోడులో భారీ వర్షానికి తడిసిన వరి ధాన్యం

## గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య

**పాపన్నపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** గుర్తు తెలియని వ్యక్తి (30-40) ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పాపన్నపేటలో శుక్రవారం చోటు చేసుకుంది. ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం... గుర్తు తెలియని వ్యక్తి పాపన్నపేట గ్రామ శివారులో చెట్టుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు అటుగా వెళ్లిన వ్యక్తులు గుర్తించి సమాచారం అందించారన్నారు. మృతుడి ఒంటిపై కుంకుమ రంగు షర్టు, నలుపు గ్రే రంగు ప్యాంటు ధరించి ఉన్నాడన్నారు. గత పక్షం రోజుల క్రితం వ్యక్తి ఉరివేసుకుని మృతి చెంది ఉంటాడని అనుమానం వ్యక్తం చేశారు. మృతదేహాన్ని మెదక్ జిల్లా అసుపత్రికి తరలించి పోస్టు మార్టం నిర్వహించినట్లు, గుర్తు తెలియని వ్యక్తిని గుర్తిస్తే మెదక్ రూరల్ సిఐ రాశేఖర్‌రెడ్డి (8712657916), ఎస్సై శ్రీనివాస్‌గౌడ్ (8712657920)లకు సమాచారం అందించాలని ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.

## మంజీరాలో మునిగి వ్యక్తి మృతి

**పాపన్నపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** విందుకు హాజరయ్యేందుకు ఏడుపాయలకు చేరుకున్న వ్యక్తి మంజీర పాయల్లో నీటి మునిగి మృతి చెందాడు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఎస్ఐ శ్రీనివాస్‌గౌడ్ కథనం ప్రకారం ఇలా ఉన్నాయి. నాగర్‌కర్నూల్ జిల్లా పెద్దకొత్తపల్లి మండలం మరికెల గ్రామానికి చెందిన వీరస్వామి (40) తన భార్య మల్లేశ్వరి, ముగ్గురు పాపలు, ఒక బాలుడితో కలిసి బంధువుల విందులో పాల్గొనేందుకు శుక్రవారం ఉదయం ఏడుపాయలకు చేరుకున్నాడు. వనదుర్గా మాతను దర్శించుకునేందుకు మంజీర పాయల్లో పుణ్యస్నానాలు ఆచరించేందుకు వెళ్లి ప్రమాదావశాస్తు నీటి మునిగి మృతి చెందాడన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.



చెత్త విభజనపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న కమిషనర్

## బహిరంగ ప్రదేశాలలో చెత్తవేస్తే జరిమానా

### మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్

**హుస్నాబాద్ రూరల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** బహిరంగ ప్రదేశాలలో చెత్తవేస్తే జరిమానాతోపాటు చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్‌గౌడ్ హెచ్చరించారు. శుక్రవారం పట్టణంలోని 16వ వార్డు రావుస్ కాలనీలో ఇంటింటికి తిరుగుతూ చెత్త విభజనపై అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు తడి, పొడి చెత్తను వేరుచేసే విధానంపై అవగాహన లేక మున్సిపల్ సిబ్బందికి చెత్తను ఇష్టం వచ్చినట్లు అందిస్తున్నారని, ఇకపై చెత్తను వేరు చేసి ఇవ్వ కుంటే తీసుకోరని స్పష్టం చేశారు. పట్టణ పరిశుభ్రతకు మున్సిపాలిటీ చేస్తున్న ప్రయత్నానికి ప్రజలు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమం లో శానిటరీ ఇన్స్పెక్టర్ బాల ఎల్లం, పర్యావరణ అధికారి రవికుమార్, మెప్మ ఆర్పీలు సృజన, సరిత, లావణ్య, స్వర్ణలత, పద్మ, జవాన్, ప్రభాకర్ ఉన్నారు.

## స్వామివారిని దర్శించుకున్న ఐపిఎస్ అధికారి



ఐపిఎస్ అధికారికి స్వామి వారి చిత్రపటం అందజేస్తున్న దృశ్యం

**కొమురవెల్లి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని శ్రీ మల్లి కార్జునస్వామిని ఉమ్మడి వరంగల్‌జిల్లాకు చెందిన ఐపిఎస్ అధికారి రూపేష్ శుక్రవారం కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి పట్నాలు వేసి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రం, స్వామి వారి చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో చేర్యాల సీఐ శ్రీనివాస్, కొమురవెల్లి ఎస్ఐ రాజు తదితరులు ఉన్నారు.

## బిఆర్ఎస్‌లో చేరిన కాంగ్రెస్ నాయకులు



బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి

**చేర్యాల, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండలంలోని ఆకునూరు గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కదుదూరి వీరారెడ్డి, అనుముల రాజశేఖర్‌రెడ్డి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. శుక్రవారం పల్లా రాజేశ్వర్‌రెడ్డి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని, దీంతో ఆ పార్టీపై ప్రజలకు నమ్మకం పోయిందని అందుకు బిఆర్ఎస్‌లో చేరామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సుంకరి మల్లేశం, గ్రామ అధ్యక్షుడు పాల బాలరాజు, శనిగరం లక్ష్మణ్, జంగిటి బిక్షపతి, మల్లమారి నవీన్, గోనెపల్లి మహేష్, ముస్యాల వంశీ తదితరులు ఉన్నారు.

## నేడు భూభారతి చట్టంపై అవగాహన సదస్సు

### హాజరుకానున్న జిల్లా కలెక్టర్, అడిషనల్ కలెక్టర్లు

**కొండపాక, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** భూ భారతి చట్టంపై రెవెన్యూ శాఖ అద్వర్యంలో ఈ నెల 26న శనివారం ఉదయం 9 గంటలకు కుకునూరుపల్లిలోని రైతువేదికలో, అదేవిధంగా కొండపాకలోని ఫంక్షన్ హాల్‌లో మధ్యాహ్నం 2 గంటలకు జిల్లా కలెక్టర్ మనుచౌదరితోపాటు, అడిషనల్ కలెక్టర్ సమావేశాలకు హాజరై రైతులకు భూ భారతి చట్టంపై అవగాహన కల్పించనున్నట్లు తహసీల్దార్లు సుజాత, దిలీప్‌కుమార్‌లు తెలిపారు. మండలాల్లోని అన్ని గ్రామాల రైతులు హాజరు కావాలని వారు కోరారు.

## పహల్గాం ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

### -తంజిముల్ మజీద్ కమిటీ చైర్మన్ సయ్యద్ మతీన్



నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ముస్లింలు

**గజ్వేల్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** పహల్గాంలో జరిగిన ఉగ్రవాదుల మారణ హోమానికి నిరసనగా శుక్రవారం గజ్వేల్ పట్టణానికి చెందిన ముస్లీంలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా తంజిముల్ మజీద్ కమిటీ అధ్యక్షుడు సయ్యద్ మతీన్ మాట్లాడుతూ భారతీయులపై జరిగిన దాడిని ముస్లిం సమాజం తీవ్రంగా ఖండిస్తుందన్నారు. మాతోటి భారతీయులను చంపిన ఏ ఒక్క తీవ్రవాదిని వదిలిపెట్టకూడదని, ఉగ్రవాదాన్ని ప్రేరేపిస్తున్న పాకిస్తాన్‌కు రాబోయే రోజుల్లో తగిన బుద్ది చెబుతామని హెచ్చరించారు. మతం పేరుతో చేసే మారణ హోమానికి ఇస్లాం అనుమతించదని, ఇలాంటి వారు ఇస్లాంకు వ్యతిరేకమని స్పష్టం చేశారు. హింసను ప్రేరేపించేవారు ముస్లింలే కాదన్నారు. భారతదేశ సమైక్యత, సమగ్రతను దెబ్బతీస్తూ ప్రజాస్వామ్యాన్ని మంటగలపాలనే ఉద్దేశంతోనే దాడులు చేస్తున్నట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరు ఎంతలా ప్రయత్నించినా అన్ని మతాలు కలిసి జీవిస్తున్న భారత్‌లో ఇలాంటి దాడులు, ఆకృత్యాలతో దేశాన్ని విచ్చిన్నం చేయలేరని, ఎన్ని శక్తులు ప్రయత్నించినా వారి కుట్రలు ఫలించబోవని స్పష్టం చేశారు. ఉగ్రవాదంపై తీసుకునే ప్రతి చర్యలు ముస్లీం సమాజం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మజీద్ కమిటీ మాజీ అధ్యక్షుడు మహ్మద్ యూసుఫొద్దీన్, సమీర్, వజీర్‌ఖాన్, హఫీజ్, తాలిబ్‌హుస్సేన్, అక్తరుల్లాబేగ్, షేర్ అలీ, రియాజ్, అక్బర్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్‌ఫండ్ చెక్కు అందజేత

**మర్కుక్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని పాతూరు గ్రామానికి చెందిన చిన్నబాల కనకయ్య ప్రైవేట్ ఆసుపత్రి ఖర్చుల నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకోగా మంజూరైన చెక్కును శుక్రవారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కనకయ్యాగౌడ్, తాజా మాజీ సర్పంచ్ అరుణ నర్సింలు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిఎం సహాయనిధి పేదలకు వరంలాంటిదని, పేదలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వంటిమామిడి ఏఎంసి డైరెక్టర్ ర్యాకం యాదగిరి,నాయకులు గుర్రాల నర్సింలు, వేణుగౌడ్, నర్సింలు, రవి తదితరులు పాల్గొన్నారు.

# భూభారతితో భూ సమస్యల పరిష్కారం సులభం

## సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి

**జహీరాబాద్/న్యాల్‌కల్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** భూ సమస్యల పరిష్కారానికి భూభారతి చట్టంతో సులభతరం చేసిందని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. శుక్రవారం నియోజకవర్గంలోని కోహీర్, ఝరాసంగం, న్యాల్‌కల్ మండలాల్లో ఏర్పాటు చేసిన భూభారతి చట్టంపై అవగాహన సదస్సుకు కలెక్టర్ వల్లూరు క్రాంతి, ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, సెట్విన్ చైర్మన్ ఎన్ గిరిధర్ రెడ్డి, అదనపు కలెక్టర్ మాధురి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్బంగా కలెక్టర్ మాట్లాడుతూ భూ సమస్యల పరిష్కారమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టంపై రైతులు పరిపూర్ణమైన అవగాహన పొందాలని సూచించారు. రైతులకు చట్టంపై అవగాహన కల్గేలా కలెక్టర్ ఒక్కో అంశాల వారిగా పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వార వివరించారు. నిర్దిష్ట గడువులోగా భూభారతితో భూ సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. సమస్యలు పరిష్కారం కాకుంటే కలెక్టర్‌కు లేదా సీసీఎల్ఏకు అప్పీలు చేసుకోవచ్చన్నారు. చట్టంలో కొత్తగా ల్యాండ్ ట్రిబ్యునల్ సైతం అందుబాటులో ఉంటుందని సూచించారు. ధరణిలో రెవిన్యూ కోర్టులను తొలగించడం మూలంగా భూ వివాదాల విషయంలో రైతులు సివిల్ కోర్టులను ఆశ్రయించాల్సి వచ్చేదని, దీంతో రైతులు ఇబ్బందులకు గురికావాల్సి వచ్చందని గుర్తు చేశారు. ప్రతి గ్రామంలో రెవెన్యూ రికార్డులు తయారు చేసి ప్రతి సంవత్సరం గ్రామాలలో రికార్డు డిస్‌ప్లే చేయడం జరుగుతుందన్నారు. ప్రతి గ్రామంలో గ్రామ పరిపాలన అఇకారులను నియమించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందన్నారు. ధరణిలో ఉన్న భూ రికార్డులు భూ భారతి చట్టంలో కొనసాగుతాయన్నారు. సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రైతుల గురించి ఆలోచించి భూ భారతి చట్టాన్ని అమలుచేసిందన్నారు. ఝరాసంగంలో ఏర్పాటుచేసిన అవగాహన సదుస్సులో ఎమ్మెల్యే కొనింటి మాణిక్‌రావు, డిసిఎంఎస్ చైర్మన్ మల్కాపురం శివకుమార్, ఆర్‌డిఓ రాంరెడ్డి, తహసీల్దార్ బాలశంకర్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.



ఝరాసంగంలో భూభారతి చట్టంపై అవగాహన కల్పిస్తున్న కలెక్టర్ క్రాంతి వల్లూరు

**న్యాల్‌కల్ మండలంలో...**

మండల కేంద్రమైన న్యాల్‌కల్‌లో నిర్వహించిన భూభారతి పట్టంపై అవగాహన సదస్సుకు జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి హాజరై చట్టంపై రైతులకు అవగాహన కల్పించారు. చట్టంపై అవగాహన కల్పించడంతో పాటు ఇందిరమ్మ ఇండ్ల బేస్‌మెంట్ లెవల్ పూర్తి చేసుకున్న వారికి 1లక్ష రూపాయల చెక్కులను అందచేశారు. కార్యక్రమంలో డిప్యూటీ కలెక్టర్ డి.మాధురి, ఆర్‌డిఓ రామ్‌రెడ్డి, సెట్విన్ చైర్మన్ గిరిధర్‌రెడ్డి, తహసీల్దార్ భూపాల్, డిప్యూటీ తహసీల్దార్ రాజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బిరేదార్ శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గుండంగారి తిరుపతిరెడ్డి, డిసిసి ఉపాధ్యక్షులు కొత్తపల్లి భాస్కర్‌రెడ్డి, సొసైటీ చైర్మన్ సిద్దలింగయ్యస్వామి, మాజీ జడ్పీటిసి సభ్యులు బ్యాత చంద్రప్ప, ఎంపిడిఓ రాజశేఖర్ కవలాస్, వ్యవసాయ అధికారులు, రైతులు, నాయకులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ఇంటర్‌షిప్ సర్టిఫికెట్ అందజేస్తున్న దృశ్యం

## ఇంటర్న్‌షిప్ సర్టిఫికెట్ల ప్రదానం

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ కామర్స్ డిపార్ట్మెంట్, ఇండియన్ పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ మెదక్ ల మధ్య ఎమ్.ఓ.యూ లో భాగంగా నలుగురు బికాం విద్యార్థులు 2 నెలల ఇంటర్న్‌షిప్ విజయవంతంగా పూర్తిచేయడం జరిగిందని. ప్రిన్సిపాల్ డా. కె.హుస్సేన్ తెలియజేసారు, ఈ విద్యార్థులు ఇంటర్న్‌షిప్ లో భాగంగా ఎంచుకున్న అంశం 'ద రోల్ ఆఫ్ ఇండియా పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ ఇన్ రూరల్ ఇండియా' అని కామర్స్ విభాగాధిపతి డా. శరత్ రెడ్డి తెలియజేసారు. ఈ రెండు నెలల కాలంలో పోస్టల్ బ్యాంకింగ్ సేవలపై ఫీల్డ్ వర్క్ ద్వారా శిక్షణ అందజేసినట్లు పోస్టల్ పేమెంట్స్ బ్యాంక్ మెదక్ బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్ తెలిపారు, ఈ ఇంటర్న్‌షిప్ ద్వారా బ్యాంకింగ్, పోస్టల్ రంగంలో ఉద్యోగ ఉపాధి అవకాశాలు కలుగుతాయని హుస్సేన్ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేయడం జరిగింది. కార్యక్రమంలో అధ్యాపకులు డా. సి.చంద్రశేఖర్, బి.శ్రీనివాస్, పి.హరిత, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ అంజద్ అలీ పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న విశ్వహిందూ పరిషత్ కార్యకర్తలు

**మెదక్ అర్బన్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** కాశ్మీర్‌లోని పహల్గాంలో అమాయకుల ప్రాణాలు తీసిన పాకిస్తాన్ ఉగ్ర వాదుల దిష్టి బొమ్మను విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శివాజీ విగ్రహం వద్ద శుక్రవారం దగ్దం చేశారు. పాకిస్తాన్ ఉగ్ర వాదులు దేశంలోకి చొరబడి అమాయకుల ప్రాణాలు పొట్టన బెట్టుకున్నారని అవేదన వ్యక్తం చేశారు. ఉగ్ర వాదులకు సరైన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్, నాయిని ప్రసాద్, ఎస్ వి శ్రీనివాస్ తోపాటు పలువురు పాల్గొన్నారు.

## ముగిసిన పంచాయతీ కార్యదర్శుల శిక్షణ కార్యక్రమం

**సంగారెడ్డి మున్సిపాలిటీ, ఏప్రిల్ 25 ప్రభాతవార్త :** సమాచార హక్కు చట్టంపై గ్రామపంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులపాటు నిర్వహించిన శిక్షణ కార్యక్రమం శుక్రవారం ముగిసింది. సంగారెడ్డిలోని ప్రాంతీయ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముగింపు కార్యక్రమానికి వీఆర్వో పద్మాజారాణి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న డిఆర్ఓ పద్మజ రాణి పంచాయతీ కార్యదర్శులు



మౌనం పాటిస్తున్న ఇస్మాల్ ఖాన్ పేట ముస్లింలు

## తీవ్రవాదుల దాడిని ఖండిస్తూ ముస్లింల నిరసన

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 25,ప్రభాతవార్త:** కాశ్మీర్ పహల్గామ్‌లో ఉగ్రవాధులు టూరిస్టులపై జరిపిన దాడిని తీవ్రంగా ఖండిస్తూసంగారెడ్డి ఇస్మాయిల్‌ఖాన్ పేట గ్రామంలో శుక్రవారం జామియా మస్జీద్ వద్ద గ్రామ ముస్లిం యువకులు, పెద్దలు కలసి నిరసన కార్యక్రమం నిర్వహించారు. పర్యాటకులపై కాల్పులు జరిపినా టెర్రరిస్టులను కాల్చి చంపాలని వారు డిమాండ్ చేశారు ఆలాగే మారణహోమంలో చనిపోయినవారి ఆత్మకు శాంతిచేకూరాలని అల్లాహ్‌నీ ప్రార్థింస్తూ 2 నిముషాల పాటు మౌనం పాటించారు. ఈ కార్యక్రమంలో జామియా మజీద్ ఇమామ్ జమీల్‌హక్‌తోపాటు గౌస్, మహమ్మద్, ఇసముద్దీన్, అమీర్‌ఖాన్,అశ్వాక్ హుస్సేన్,హాజీ, హనీఫ్, ముస్తాక్ హుస్సేన్, అమీరుద్దీన్, మజీద్ హుస్సేన్, సలీం, సోనూ, జుబేర్,ఖాజా పాషా, మహమ్మద్, మ్యాతబ్ఖాన్ , అజహర్,షకీల్, ఇస్తియాక్ హుస్సేన్, సమద్ పాల్గొన్నారు.

## విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ప్రారంభం

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** శుక్రవారం సంగారెడ్డిలోని పోతిరెడ్డిపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉచిత శిక్షణ శిబిరాన్ని జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు ప్రారంభించారు. రెండు వారాల పాటు జరిగే శిక్షణ కార్యక్రమంలో శాస్త్రీయ సంగీతం, నాట్యము, చిత్రలేఖనం, చదరంగము కుట్లు అల్లికలు, యోగ ధ్యానం, ఇండోర్ గేమ్స్ తదితర అంశాలలో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆయన తెలిపారు. అదేవిధంగా జిల్లాలోని 28 మండలాలలో ఈ ఉచిత వేసవి శిక్షణ శిబిరాలు ఈరోజు నుండి ప్రారంభించడం జరుగుతుందని అన్నారు కార్యక్రమంలో సంబంధిత అంశాలలో నిపుణులైనటువంటి అధ్యాపక బృందం సమకశిక్ష సెక్టోరల్ అధికారులు, బాలయ్య ఏఎంఓ, వెంకటేశం సీఎంఓ, మండల విద్యాధికారి విద్యాసాగర్ జిల్లా సైన్స్ అధికారి సిద్ధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఏపిఏ అబాకస్ 2.0 ఉచిత శిక్షణ యాప్ పోస్టర్ ఆవిష్కరణ

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** విద్యార్థుల గణిత నైపుణ్యాలను పెంపొందించేందుకు రూపొందించిన "ఏపిఏ అబాకస్ 2.0" యాప్ ఉచిత శిక్షణకార్యక్రమ పోస్టర్‌ను జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ వ్యవస్థాపకులు అడ్డగట్ట గంగాధర్ గారు మాట్లాడుతూ, న్యూరో టెక్నాలజీ ఆధారంగా అభివృద్ధి చేసిన ఈ అబాకస్ యాప్ ద్వారా విద్యార్థులు తమ చేతివేళ్లపై వేగవంతంగా జమ, తీసివేత, గుణాకార, భాగాహార లెక్కలను శిక్షణ పొందగలుగుతారన్నారు. 10,000 వరకు సంఖ్యలను వేగంగా లెక్కించే సామర్థం ఈ విధానంలో ఉందని వివరించారు. జిల్లా విద్యాశాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో గణితం పట్ల భయంపోయి, ఏకాగ్రత మరియు జ్ఞాపకశక్తి మెరుగుపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో సిఎంఓ వెంకటేశం , ఏఎంఓ (అకడెమిక్ మానిటరింగ్ ఆఫీసర్) బాలయ్య , జిసిడిఓ సుప్రియా , ప్లానింగ్ కోఆర్డినేటర్ శ్రీ తాజుద్దీన్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈవో

# ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టేందుకే రజతోత్సవ సభ

## -ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, ఎఫ్‌డిసి మాజీ చైర్మన్ ప్రతాప్‌రెడ్డి

**గజ్వేల్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 16 నెలలు గడిచినా రాష్ట్రంలో చేసిందేమీలేదని ఉమ్మడి మెదక్ జిల్లా ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం గజ్వేల్‌లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఈనెల 27న వరంగల్ జిల్లాలోని ఎల్కతుర్తిలో నిర్వహించే రజతోత్సవ బహిరంగ సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గజ్వేల్ నియోజకవర్గం నుండి 15 వేల మందిని బహిరంగ సభకు తరలించే ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. కనీవినీ ఎరుగని రీతిలో బహిరంగ సభ ఉంటుందని, రాష్ట్ర వ్యాప్తంగా భారీ ఎత్తున ప్రజలు బహిరంగ సభకు తరలివస్తారన్నారు. గతంలో కెసిఆర్ చేసిన అభివృద్ధిపై, ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం నిరంకుశ పాలనపై సభలో చర్చిస్తారన్నారు. ప్రజలకు అర్థమయ్యేవిధంగా మాజీ సిఎం కెసిఆర్ సభలో ప్రసంగిస్తారన్నారు. రాష్ట్రంలో టిఆర్ఎస్, బిఆర్ఎస్‌ను ప్రజలు కోరుకుంటున్నారని, ఏ రాష్ట్రంలో లేనివిధంగా అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ పార్టీ ప్రజాధరణ కోల్పోయిందన్నారు. రజతోత్సవ సభ సందర్భంగా ఈనెల 27న ప్రతి మండల కేంద్రంలో, ప్రతి గ్రామపంచాయతీలో, ప్రతి మున్సిపాలిటీలో పార్టీ జెండా ఆవిష్కరించి సభకు తరలివెళ్ళడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, మాజీ వైస్ చైర్మన్ జకియొద్దీన్, గజ్వేల్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, నవాజ్‌మీరా, గోపాల్‌రెడ్డి, ఆకుల దేవేందర్, ఊడెం కృష్ణారెడ్డి, బబ్బూరి రజితగౌడ్, బొల్లారం ఎల్లయ్య, జేజల వెంకట్‌గౌడ్, మర్కంటి కనకయ్య, మద్దూరి శ్రీనివాస్‌రెడ్డి, రహీం, రమేష్ గౌడ్, మోహన్‌బాబు, నాగిరెడ్డి, సాయిరాజ్, కొనమైన రమేష్,మధుసూదన్‌రెడ్డి, దయాకర్‌రెడ్డి పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి



పోగొట్టుకున్న బ్యాగ్‌ను బాధితులకు అందిస్తున్న డిఎం, కండక్టర్

## ఆర్టీసీలో భద్రతతోపాటు భరోసా : డిఎం రఘు

**సిద్దిపేట ప్రభాతవార్త ప్రతినిధి**

ఆర్టీసీ బస్సులలో సురక్షితమైన ప్రయాణంతో పాటు భద్రత ఉంటుందని సిద్దిపేట డిపో మేనేజరు టి.రఘు అన్నారు. శుక్రవారం సిద్దిపేట డిపోకు చెందిన కామారెడ్డికి వెళ్తున్న టిఎస్ 36టి 1586 బస్సులో కామారెడ్డి నుండి ముస్తాబాద్‌కు ప్రయాణం చేస్తూ బస్సు దిగే సందర్బంలో బస్సులో బ్యాగ్‌ను మర్చిపోగా గమనించిన కండక్టర్ వేణుగోపాల్‌రావు తీసుకుని సిద్దిపేట స్టేషన్ మేనేజరు బాలకిషన్ పోలీస్ సెక్యూరిటీ సురేష్ ఆధ్వర్యంలో బాదితురాలు పడియక నీరజకు అందజేశారు. బాధితురాలికి అందజేసిన బ్యాగులో తులం బంగారంతోపాటు రూ 10వేలు ఉన్నాయని డిఎం తెలిపారు. నిజాయతీ చాటుకున్న కండక్టర్‌ను డిఎం ప్రత్యేకంగా అభినందించారు.

## ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన కారణం

### -శ్రీగిరిపల్లి పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ బల్బీర్‌సింగ్





ప్రజ్ఞాపూర్ అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

**గజ్వేల్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** ప్రజారోగ్యానికి దోమలు ప్రధాన కారణమని శ్రీగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి డాక్టర్ బల్బీర్ సింగ్ పేర్కొన్నారు. శుక్రవారం ప్రపంచ మలేరియా దినోత్సవం పురస్కరించుకొని ప్రజ్ఞాపూర్‌లో రామాలయం నుండి జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల వరకు బస్టాండ్ నుండి జగదేవ్‌పూర్ రోడ్డు వరకు, అంగన్‌వాడీ కేంద్రం నుండి ఎస్సీ కాలనీ వరకు ర్యాలీ నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్బంగా డాక్టర్ బల్బీర్‌సింగ్ మాట్లాడుతూ దోమలు మానవాళికి ప్రధాన శత్రువులని, దోమల వల్ల మలేరియా, ఫైలేరియా, డెంగ్యూ, చికెన్ గునియాలాంటి వ్యాధులు సంక్రమిస్తాయని, సమాజంలో ప్రతి ఒక్కరూ వారి ఇంటి వద్ద నీటి నిలువలు లేకుండా చూసుకోవాలని, వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. ఆరోగ్య సంస్థ సూచనల ప్రకారం 2030 వరకు మలేరియా వ్యాధిని నిర్మూలించాలని, దీనికి ప్రజల సహకారం కావాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ సబ్ యూనిట్ అధికారి శ్రీనివాస్, ఎంపిహెచ్ఈఓ సురేందర్, హెల్త్ అసిస్టెంట్ దేవసాని వాసుదేవ్, డి.నాగరాజు, ఫీల్డ్ వర్కర్ ఎన్.రమేష్, ఏఎన్ఎంలు నిరూప, అరుణ, కనకవ్వ, ఆశ కార్యకర్తలు రాణి, సుల్తానాబేగం, రాధిక, శ్యామల, నమిత పాల్గొన్నారు.

## రజతోత్సవ సభకు భారీగా తరలిరావాలి

### -బిఆర్ఎస్ యువజన నాయకుడు చెప్యాల రాజేశ్వర్‌రావు





వాల్‌పోస్టర్లకు గోడలకు అతికిస్తున్న రాజేశ్వర్‌రావు

**గజ్వేల్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** ఈనెల 27న వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బిఆర్ఎస్ రజతోత్సవ సభ సందర్బంగా శుక్రవారం గజ్వేల్ నియోజకవర్గంలో సిద్దిపేట జిల్లా హరితసేన అధ్యక్షుడు, బిఆర్ఎస్ రాష్ట్ర యువజన నాయకుడు చెప్యాల రాజేశ్వర్‌రావు ఆధ్వర్యంలో వాల్ పోస్టర్లను గోడలకు అతికించారు. ఈ సందర్బంగా రాజేశ్వర్‌రావు మాట్లాడుతూ కెసిఆర్ అధ్యక్షతన జరగబోయే రజతోత్సవ సభకు ప్రజలు భారీగా తరలిరానున్నట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ గతంలో కెసిఆర్ చేసిన అభివృద్ధిని సభలో వివరిస్తారన్నారు. రజతోత్సవ సభకు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. ఆయనతో పాటు బిఆర్ఎస్ నాయకులు గర్నెపల్లి సతీష్ ఉన్నారు.

## కొనుగోలు కేంద్రాల పరిశీలన

**నంగునూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** మండలంలోని ముండ్రాయి, పాలమాకులలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను చీఫ్ రైజనింగ్ స్టేట్ ఆఫీసర్ ఫణిందర్(ఐఎఎస్) శుక్రవారం రోజున పరిశీలించారు. రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు ఈ ధాన్యం కొనుగోలు సెంటర్లను డిఆర్‌డిఏ పిడి జగదేవ్ ఆర్యా, అడిషనల్ పిడి మధుసూదన్, డిఎస్‌వో తనుంజా, డిఎం ప్రవీణ్‌లతో కలిసి సందర్శించారు. ఈ సందర్బంగా సెంటర్లలో రైతులకు కల్పిస్తున్న సౌకర్యాలు ఎలా ఉన్నాయని ఏమైనా ఇబ్బందులు ఉన్నాయని అడిగి తెలుసుకున్నారు. ధాన్యం కొనుగోళ్ల లో కొనుగోళ్లు సాఫీగా సాగుతున్నాయని రైతులకు ఉన్న చిన్న చిన్న సమస్యలను పౌరసరఫరాల శాఖ కమిషనర్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో ఏపిఎం మహిపాల్ సిసి లింగం ఉన్నారు.

## పూలె సినిమాను సెన్సార్ లేకుండా విడుదల చేయాలి

### ధర్మ స్వరాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు

**చిన్నకోడూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త :** భారత తొలి విప్లవ, సామాజిక పితామహుడు మహాత్మ జ్యోతిరావు పూలే జీవిత చరిత్ర, పోరాటం గురించి తీసిన పూలే సినిమాను ఆనంత్ మహదేవ్ తెరకు ఎక్కించడం అభినందనీయమని, ఈ సినిమాను ఉన్నది ఉన్నట్లుగా ఎలాంటి సెన్సార్ లేకుండా విడుదల చేయాలని ధర్మ స్వరాజ్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రవిబాబు డిమాండ్ చేశారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత ప్రపంచ మేధావి బిఆర్ అంబేద్కర్ సమాన కుల నిర్మూళన అనే పుస్తక సంచలనంలో ఉన్న లాగానే తీసిన సినిమాకు ఆంక్షలు విధించవద్దన్నారు.

## రజతోత్సవ సభకు భారీగా తరలివెళదాం

### బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఎన్‌వై యాదవ్

**మిరుదొడ్డి, ఏప్రిల్ 25,ప్రభాతవార్త :** మాజీ సిఎం కెసిఆర్ ఆదేశాల మేరకు ఈనెల 27న ఉమ్మడి వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో జరిగే భారీ బహిరంగ సభకు అక్బర్‌పేట-భూంపల్లి మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి భారీగా తరలివెళ్లుదామని జిల్లా పార్టీ నాయకులు ఎన్‌వై యాదవ్ పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో ఎలా ముందు వరుసలో ఉన్నామో అదే తరహాలో బిఆర్ఎస్ రజతోత్సవ సభను విజయవంతం చేయడంలో సైతం ముందు ఉందామన్నారు. ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర యువజన నాయకులు సోలిపేట సతీష్‌రెడ్డిల పిలుపు మేరకు మండలం నుంచి భారీగా తరలివెళ్లుదామన్నారు. బిఆర్ఎస్ రజతోత్సవం సభలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాల్సిన సమయం అసన్నమైందన్నారు.

## ఘనంగా ఎమ్ఎన్ఆర్ 51వ స్థాపన దినోత్సవం

**సంగారెడ్డి మున్సిపాలిటీ ఏప్రిల్ 25, ప్రభాతవార్త :**

సంగారెడ్డి సమీపంలోని ఎమ్మెన్నార్ యూనివర్సిటీ ప్రాంగణంలో శుక్రవారం ఎమ్.ఎన్.ఆర్.ఈ.టి 51వ స్థాపన దినోత్సవాన్ని, నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ మరియు ప్రముఖ విద్యావేత్త ఎమ్.ఎన్.రాజు 86వ జన్మదిన వేడుకలతో కలిపి ఘనంగా నిర్వహించించారు. ఈ సందర్బంగా విద్యార్థులు మరియు అధ్యాపకులు, బోధనేతర సిబ్బంది పోటీలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సంజీవరెడ్డి

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ

**మనూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని దూదగొండ పంచాయతీ పరిధిలోని గట్టిలింగంపల్లిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి శుక్రవారం ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి భూమి పూజ నిర్వహించి ఇంటి నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ సొంతింటి కల నెరవేర్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం రూ. 5 లక్షల విడతలవారీగా లబ్ధిదారులకు అందజేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు బ్రహ్మానందరెడ్డి, రాజు, ధనరాజ్ పాటిల్, తుమ్మూరు సంజీవరెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సన్మానించిన ఎమ్మెల్యే



విద్యార్థులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే చింత ప్రభాకర్

**సదాశివపేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** పట్టణంలోని ఉజ్వల్ కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే చింత ప్రభాకర్ శాలువాలుకప్పి ఘనంగా సన్మానించారు. కళాశాలలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో సీఈసీలో 489 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 5వ ర్యాంక్ సాధించిన అఫ్రా బేగం, రెండవ సంవత్సరంలో బైపీసీలో 985 మార్కులు సాధించి పట్టణ ప్రథమ ర్యాంక్ సాధించిన నేహా ఫిర్దౌస్, ఎంపీసీలో 950 మార్కులు సాధించి ప్రథమ స్థానంలో నిలిచిన మెహినాజ్‌బేగం, అక్షిత సీఈసీలో 939 సాధించి పట్టణ ప్రథమ స్థానంలో నిలవడంతో శుక్రవారం ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కూచి శ్రీనివాస్, వైస్‌ప్రిన్సిపాల్ అమరేందర్‌రెడ్డి, డైరెక్టర్లు ముద్ద నాగరాజ్, రఘువర్ధన్‌రెడ్డి, కరస్పాండెంట్ పోల వెంకటేశం, విద్యార్థులు పాల్గొన్నారు.

## పెండింగ్ వేతనాలు చెల్లించాలి



మున్సిపల్ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న సిఐటీయు నేతలు

**జహీరాబాద్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** పెండింగ్‌లో ఉన్న వేతనాలు, 3 నెలల పీఎఫ్ డబ్బులను వెంటనే చెల్లించి కార్మికులను ఆదుకోవాలని సీఐటీయు నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సిఐటీయు నాయకులు అధికారికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయు జిల్లా సహాయ కార్యదర్శి మహిపాల్ మాట్లాడుతూ మున్సిపల్‌లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల పట్ల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. నెలలుగా జీతాలు చెల్లించకపోవడంతో కార్మికుల కుటుంబాలు ఎలా బతుకుతాయని ప్రశ్నించారు. మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న పీఎఫ్ డబ్బులు చెల్లించాలని డిమాండ్ చేశారు. రెక్కాడితే కాని డొక్కాడని కార్మికుల పట్ల అధికారులు సవతి తల్లి ప్రేమ కనబర్చడం సరికాదని హితవు పలికారు. పనిలో గాయపడ్డ సామేల్‌కు వైద్య ఖర్చుల కోసం ఆదుకోవాలని వేడుకుంటున్నా తమకేం పట్టనట్లుగా వ్యవహరించడం సరికాదన్నారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళన ఉధృతం చేయాల్సి వస్తుందని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ నాయకులు యశోద,మాణిక్, సిద్ధమ్మ, తుకారాం తదితరులు పాల్గొన్నారు.

## కంగ్టిలో కొవ్వొత్తుల ర్యాలీ



కంగ్టిలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న యువకులు

**కంగ్టి, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్ పహల్గాంలో ఉగ్రదాడిని నిరసిస్తూ కంగ్టిలో గురువారం రాత్రి 8 గంటలకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. యువజన సంఘాల ఆధ్వర్యంలో సుభాష్‌చంద్రబోస్ చౌక్ నుంచి పాత పంచాయతీ వరకు శాంతియుతంగా ర్యాలీ నిర్వహించారు.

## ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం

**మెదక్ అర్బన్, 25 ఏప్రిల్ (ప్రభాతవార్త):** కాశ్మీర్‌లోని పహల్గాంలో అమాయకుల ప్రాణాలు తీసిన పాకిస్తాన్ ఉగ్రవాదుల దిష్టిబొమ్మను విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని శివాజీ విగ్రహం వద్ద శుక్రవారం దగ్ధం చేశారు. పాకిస్తాన్ ఉగ్రవాదులు దేశంలోకి చొరబడి అమాయకుల ప్రాణాలు పొట్టనబెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉగ్రవాదులకు సరైన గుణపాఠం చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గడ్డం శ్రీనివాస్, ఎన్వీ ప్రసాద్, ఎస్వీ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఉగ్రవాదుల దాడికి వ్యతిరేకంగా టేక్మాల్‌లో నిరసన

**టేక్మాల్, 25 ఏప్రిల్ (ప్రభాతవార్త):** జమ్మూ కాశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదుల దాడికి నిరసనగా టేక్మాల్లో ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి శుక్రవారం ప్రార్థనలో పాల్గొన్నారు. ఉగ్రదాడిలో చనిపోయిన 27 మంది భారతీయులకు వారు సంతాపం తెలిపారు. హిందుస్తాన్ జిందాబాద్, పాకిస్తాన్ ముర్దాబాద్ అని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా మైనారిటీ రైట్ ప్రొటెక్షన్ కమిటీ ప్రధానకార్యదర్శి ఎంఏ సలీమ్ మాట్లాడుతూ భారత్‌పై ఉగ్రదాడులు జరగకుండా ప్రధానమంత్రి, కేంద్ర హోమ్‌మంత్రి పాకిస్తాన్‌పై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. దేశ రక్షణ కోసం కేంద్ర ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకున్నా భారతీయులుగా తామంతా అండగా నిలుస్తామన్నారు. అవసరమైతే దేశం కోసం మా ప్రాణాలను సైతం అర్పిస్తామని చెప్పారు.



టేక్మాల్లో నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న ముస్లింలు

# తాగునీటికి రూ. 3 కోట్లు కేటాయించండి : ఎమ్మెల్యే

**మనూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** నియోజక వర్గంలోని తాగునీటి అవసరాలు తీర్చేందుకు 3 కోట్ల రూపాయలు కేటాయించాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి గురువారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతిని కోరారు. మండల పరిధిలోని బోరంగ గ్రామ శివారులో ప్రవహిస్తున్న మంజీర నదిని ఎమ్మెల్యే సంజీవరెడ్డి, అదనపు కలెక్టర్ మాధురితో కలిసి కలెక్టర్ క్రాంతి వల్లూరు మంజీర నది పరిసరాల ప్రాంతాలను పరిశీలించారు. గత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఎన్ఎపి పథకం ద్వార నియోజకవర్గం ప్రజల తాగునీటి అవసరాలు తీర్చేందుకు బోరంచ, షాపూర్ వ్ద నిర్మించిన పథకాలు తిరిఇ ప్రారంభించి నియోజకవర్గంలో తాగునీటి కష్టాలు రాకుండా చూడాలని, అందుకు నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యే కలెక్టర్‌కు వివరించగా కలెక్టర్ సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే



బోరంచ వద్ద మంజీర నదిని ఎమ్మెల్యేతో కలిసి పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ క్రాంతి

పేర్కొన్నారు. బోరంచలో నల్లపోచమ్మ, సంగమేశ్వర ఆలయాలను దర్శించుకునేందుకు, మంజీర పరవళ్లు వీక్షిందుకు కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణలోని ఆయా ప్రాంతాల నుంచి భక్తులు, పర్యాటకులుపెద్ద సంఖ్యలో వస్తూ ఉంటారని సూచించినట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో డిసిసి ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# రైతులు దళారులను నమ్మి ఆగం కావొద్దు : ఎమ్మెల్యే

**కొల్చారం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** గ్రామాలు మురికి కూపాలుగా మారాయని అధికారులు శ్రద్ధ వహించి పారిశుధ్యం పనులు చేపట్టాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకారం సంఘం పరిధిలోని పైతర, కొనాపూర్, ఏటిగడ్డ మాందాపూర్, ఐకెపి ఆధ్వర్యంలో రాం పూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతలక్ష్మారెడ్డి బిఆర్ఎస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. రైతులు దళారులను నమ్మి ఆగం కావొద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

### సిఎంఆర్ఎఫ్‌ను సద్వినియోగం చేసుకోవాలి

సిఎంఆర్ఎఫ్ నిధులను లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి అన్నారు. శుక్రవారం కొనపూర్ గ్రామంలో బాధితు లకు సిఎంఆర్ఎఫ్ చెక్కులను అందచేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ గఫార్‌మియా, ఎంపిడిఓ రఫిక్ ఉన్నిసా, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాంపల్లి గౌరిశంకర్‌గుప్తా, యూత్ ఐకాన్ నాయకులు రవితేజరెడ్డి, మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షులు విష్ణువర్ధన్‌రెడ్డి, సూరేగిరి నరేందర్‌రెడ్డి, ముత్యంగారి సంతోష్, డిసిఎంఎస్ వైస్ చైర్మన్ ఆరిగే రమేష్, సొసైటీ వైస్‌చైర్మన్ మెతుకు మల్లేశం, చిట్యాల యాదయ్య, సాయిని సిద్దిరాములు, సంతోష్‌రావు, మాందాపూర్ రాజుగౌడ్, వార్డు మాజీ సభ్యుడు సురేష్, సీఈఓ నవీన్ యదవ్, ఎల్లేషం, బాగారెడ్డి, మాజీ సర్పంచ్ వెంకటేశం గుప్తా, ఆంజనేయులు, బాబు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్సీకి వినతిపత్రం అందచేస్తున్న జేఎన్టీయూహెచ్ ఒప్పంద అధ్యాపకులు

## కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులరైజ్ చేయాలి -పట్టభద్రుల ఎమ్మెల్సీ అంజిరెడ్డి

**చౌటకూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యూలరైజ్ చేయాలని పట్టభద్రుల ఎమ్మెల్సీ చిన్నమైల్ అంజిరెడ్డి డిమాండ్ చేశారు. మండల పరిధిలోని సుల్తాన్‌పూర్‌లోని జెఎన్టీయూ కళాశాల వద్ద కాంట్రాక్ట్ ఉద్యోగులు చేపడుతున్న నిరవధిక సమ్మె శుక్రవారంతో 7వ రోజుకు చేరుకుంది. శుక్రవారం ఎమ్మెల్సీ అంజిరెడ్డి సమ్మె శిబిరాన్ని సందర్శించి సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అంజిరెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి రాష్ట్ర పాలనలో నియామకమైన అసిస్టెంట్ ప్రొఫెసర్లను ఇప్పటి వరకు పర్మనెంట్ చేయకపోవడం సిగ్గుచేటుగా ఉందని విస్మయం వ్యక్తం చేశారు. రాష్ట్రంలోని 12 యూనివర్సిటీలలో 1445 మంది కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్‌లు విధులు నిర్వహిస్తున్నారని, కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యూలరైజ్ చేయడం చాయి తాగినంత సమయం కూడా పట్టదని, ఎన్నికల సమయంలో హామి చేసిన రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చిక ఆ ఊసే ఎత్తకపోవడం విడ్డూరంగా ఉందని దుయ్యబట్టారు. ప్రభుత్వ వెంటనే స్పందించి కాంట్రాక్ట్ ఉద్యోగులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించకుంటే బిజెపి ఆధ్వర్యంలో ఆందోళన చేపడుతాయని హెచ్చరించారు. అంతకు ముందు అసిస్టెంట్ ప్రొఫెసర్లు చిలిప్‌ఎడ్ మండలం చిట్కుల్ వద్ద కొలువున్న శ్రీ చాముండేశ్వరిఈ మాతను దర్శించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించుని తమకు న్యాయం జరిగేలా దీవించాలని వేడుకున్నామన్నారు.

## విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నతస్థాయికి ఎదగాలి

### మెదక్ జిల్లా అదనపు ఎస్‌పి మహేందర్

**నర్సాపూర్, ఏప్రిల్ 24 ప్రభాతవార్త:**

విద్యార్థులు పట్టుదలతో చదివి ఉన్నత పదవులు పొంది జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలని జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ అన్నారు. గురువారం రాత్రి నర్సాపూర్ సమీపంలోని బి వి ఆర్ ఐ టి కళాశాలలోని విష్ణు పబ్లిక్ హై స్కూల్ పాఠశాల వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ వార్షికోత్సవ వేడుకల కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జిల్లా అదనపు ఎస్పీ మహేందర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మార్కులే ప్రామాణికంగా అనుకోకుండా తక్కువ మార్కులు వచ్చిన వారు సైతం తమ ప్రతిభతో ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు. తాను ఈ పరీక్షలు తప్పానని బాధపడకుండా ఇది విజయానికి మొదటి మెట్టుగా భావించి కష్టపడి అనుకున్న లక్ష్యాన్ని సాధించాలన్నారు. ఈ వార్షికోత్సవాల సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆటలు పాటలు అందరినీ అలరించాయి. ఈ మేరకు విష్ణు పబ్లిక్ హైస్కూల్లో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో బివిఆర్ఐటి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సంజయ్ దూబే, వైఫర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రమేష్, విష్ణు పబ్లిక్ హై స్కూల్ ప్రిన్సిపాల్ జామి, వైస్ ప్రిన్సిపాల్ విశ్వనాథ్, ఏవో సురేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు



సరోజనమ్మగుట్ట అభివృద్ధి ప్రణాళికలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

## సరోజనమ్మ గుట్ట అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే

**రామచంద్రాపురం, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలోని వెలిమెల గ్రామ పరిధిలోనిగల సరోజనమ్మ గుట్ట అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి ఆయా శాఖల అధికారులు, మాజీ ప్రజాప్రతినిధులు, గ్రామస్థులతో కలిసి సరోజనమ్మ గుట్టను పరిశీలించారు. గుట్టపై భక్తు సౌకర్యార్థం మౌలిక వసతులతోపాటు ప్రహరీ గోడ, సిసి రోడ్డు నిర్మాణం పనులను చేపట్టనున్నట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు. ఆలయ జీర్ణోద్ధారణ దశలో ఉనన డేఉ దేవాలయం సైతం పునర్‌నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. గుట్ట అభివృద్ధికి సింహ అసోసియేట్స్ సంపూర్ణ సహకారం అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి, రామచంద్రాపురం ఆర్‌డిఓ సంగ్రాంరెడ్డి,మాజీ కౌన్సిలర్లు పట్లోళ్ల రవీందర్‌రెడ్డి, సుచిన కొమరయ్య, సింహ అసోసియేట్స్ చైర్మన్ నరసింహ తదితరులు పాల్గొన్నారు.

### లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అల్పాహారం పంపిణీ

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):** పట్టణంలోని ప్రభుత్వాసుపత్రి వద్ద లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత అల్పాహార పంపిణీ కార్యక్రమం శుక్రవారం 4వ సంవత్సరం 299వ రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా లయన్స్ క్లబ్ రీజియన్ ఫాస్ట్ చైర్మన్ గుడాల రాధాకృష్ణ మాట్లాడుతూ మానవ సేవే మాధవ సేవ అని లయన్స్ క్లబ్ సభ్యుల సహకారంతో ప్రభుత్వాసుపత్రిలో రోగులకు, వారి బంధువులకు ఉచితంగా అల్పాహారం పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. స్టార్ హెల్త్ ఇన్సూరెన్స్ ఉద్యోగి అశ్విన్, కవిత దంపతుల పెళ్ళిరోజు సందర్భంగా ఈ రోజు నుండి 15 రోజుల వరకు అల్పాహార పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ ఆఫ్ స్నేహ అధ్యక్షులు మల్లేశంగౌడ్, లయన్ పరమేశ్వరచారి, దొంతుల సత్యనారాయణ, రాము తదితరులు పాల్గొన్నారు.

### మాజీ జెడ్‌పిటిసిని పరామర్శించిన హరీష్‌రావు

**గజ్వేల్ టౌన్, ఏప్రిల్ 25 (ప్రభాతవార్త):**

గజ్వేల్ మాజీ జెడ్‌పిటిసి పంగ మల్లేశం ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు శుక్రవారం పరామర్శించారు. ప్రమాదంలో గాయపడి శస్త్రచికిత్స అనంతరం విశ్రాంతి తీసుకుంటున్న మల్లేశంను జరిగిన ప్రమాదం గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ప్రజ్ఞా గార్డెన్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారివెంట ఎమ్మెల్సీ డాక్టర్ యాదవరెడ్డి, మాజీ ఎఫ్‌డిసి చైర్మన్ ప్రతాప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి, మాజీ ఏఎంసి చైర్మన్ మాదాసు శ్రీనివాస్, బిఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్‌మీరా, వైస్ చైర్మన్ జకియొద్దీన్ తదితరులు ఉన్నారు.

# రెడ్‌క్రాస్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే

**చిన్నశంకరం పేట, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** రక్తదానమే కాకుండా జిల్లాలో రెడ్‌క్రాస్ చేపడుతున్న సేవలు అభినందనీయమని మెదక్ ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో తుప్రాన్ వివిఎస్‌టి ఇండస్ట్రీస్ సహకారంతో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ మెదక్ జిల్లా ఆధ్వర్యంలో నిర్వహించిన మెగా వైద్యశిబిరంలో పాల్గొని రోగులకు మందులను అందించారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ముమ్మరంగా సేవాకార్యక్రమాలు చేపడుతున్నట్లు ఆ సంస్థ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగం శ్రీనివాసరావు తెలిపారు. రెడ్ క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యుడు దేమే యాదగిరి మాట్లాడుతూ జిల్లాలో వివిధ ప్రాంతాల్లో రక్తదాన శిబిరాలు, మెగా వైద్య క్యాంపులు, ఇతర సేవా కార్యక్రమాలు చేపట్టామన్నారు. కాగా చిన్న శంకరంపేటలో నిర్వహించిన ఉచిత వైద్య మెగా క్యాంపుకు ప్రజల నుండి మంచి స్పందన లభించింది.మేడ్చల్ మెడిసిటీ ఆసుపత్రికి చెందిన డాక్టర్లు ప్రవళిక, సంజన,నీరజ, దీక్షిత, సుప్రియ, సౌజన్య,



రెడ్ క్రాస్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రోహిత్ మందులను పంపిణీ చేస్తున్న దృశ్యం

హర్ష, తేజస్విని, హన్సిక పేషెంట్లకు వైద్య సేవలు అందించారు. అంతేకాకుండా పిహెచ్‌సికి చెందిన డాక్టర్లు హృదయ్, మెడికల్ సిబ్బంది కుమారి, నందిని, బుజ్జి, మాధవి, లలిత, రేణుకా పాల్గొన్నారు. అనంతరం ఉచితంగా మందులను పంపిణీ చేశారు. సుమారు 100 మందికి పైగా రోగులు వివిధ రకాల పరీక్షలను చేయించుకున్నారు.

ఈకార్యక్రమములో వైస్ చైర్మన్ లయన్ పోడేండ్ల లక్ష్మణ్‌యాదవ్, రాష్ట్ర ఎంసీ మెంబర్ సింగం శ్రీనివాస్‌రావు కార్యదర్శి టి సుభాష్ చంద్రబోస్, కోశాధికారి డి.జి శ్రీనివాస్‌శర్మ, మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు యాదగిరి, మద్దెల సత్యనారాయణ, సభ్యులు తోట శ్రీనివాస్, సభ్యులు తిరుపతి, నేవూరి మాధవరెడ్డి పాల్గొన్నారు.

## 30న ఐరన్ స్క్రాప్ వేలం

**కంది, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** ఈ నెల 30వ తేదీన కంది సెంట్రల్ జైలులోని స్టీల్ ప్యాక్టరీ నుంచి వచ్చిన వృధా ఐరన్ స్క్రాప్‌ను బహిరంగ వేలం ద్వారా విక్రయిస్తున్నట్లు జైలు సూపరింటెండెంట్ సంతోష్‌రాయ్ పేర్కొన్నారు. ఉదయం 10.30 గంటలకు వేల పాట ప్రారంభం అవుతుందన్నారు. ఆసక్తి గల వారు 5వేల రూపాయల డీడీ రూపంలో కట్టి వేలంలో పాల్గొనవచ్చన్నారు. వేలంలో స్టీల్‌ను సొంతం చేసుకున్న వ్యక్తి మిగతా మొత్తంతో పాటు 18శాతం జీఎస్టీ చెల్లించి రెండు రోజుల్లో మెటీరియల్‌ను జైలు నుంచి తీసుకుపోవాల్సి ఉంటుందన్నారు. డీడీలు కట్టి వేలంలో పాల్గొని వేలంను దక్కించుకోని వారికి డీడీ నగదును వెంటనే తిరిగి చెల్లించడం జరుగుతుందన్నారు.

## సీమ ఆంజనేయ ఆలయంలో అఖండ హరినామ సప్త

**సిర్గాపూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** మండల పరిధిలోని చాప్ట, ఉజలంపాడ్ గ్రామాలశివారులో కొలువుండి నిత్యం భక్తులతో పూజలందుకుంటున్న శ్రీ సీమ ఆంజనేయస్వామి దేవాలయంలో శ్రీఅఖండ హరినామ సప్త కార్యక్రమాలు భక్తి శ్రద్ధలతో కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా 5వ రోజైన శుక్రవారం కీర్తన సేవా కార్యక్రమాలు మహారాష్ట్ర షాపూర్ శ్రీ పరమేశ్వర మహారాజ్ హరిభక్త పారాయణ్ నిర్వహించారు. భక్తులకు సీతారాం తండా వాసుల సహకారంతో అన్నదానం వితరణ చేశారు. కార్యక్రమంలో హరినామ భక్తులు, భజన బృంధాలు శ్రీ సీమ హనుమాన్ దేవాస్థనం ట్రస్ట్ సభ్యులు పాల్గొని అన్నదాతలకు, మహారాజ్‌లను సన్మానించారు.

## సిర్గాపూర్‌లో వేసవి శిక్షణ కేంద్రం : ఎంఇవో

**సిర్గాపూర్, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి ఆదేశాల మేరకు సిర్గాపూర్‌లోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో తెలంగాణ రైజింగ్ ఉచిత వేసవి శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం మండల విద్యాధికారి నాగారం శ్రీనివాస్ ప్రారంభించారు. శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు మనోవికాసం పెంపొందించడానికి సంగీతం,శాస్త్రీయ నృత్యం, చిత్రలేఖనం, వ్యక్తిగత వికాసం, కుట్లు, అల్లికలు, చదరంగం, ఇండోర్ గేమ్స్, పిఎల్ఎం తయారీ కథలు, యోగా ధాన్యంలపై శిక్షణ కల్పిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా విద్యాధికారి సుంకేసుల వెంకటేర్లు రూపకలన చేసిన శిక్షణను అందుకు విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని శ్రీనివాస్ వివరించారు. మే 13వ తేదీ వరకు శిక్షణ కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో ఇంచార్జి ఎస్ఓ మహేశ్వరీ, ఉపాధ్యాయులు దుర్గం శ్రీదేవి, ఆరే స్వప్న, కవిత, ఏ రవీందర్, వెంకట్‌రావు, సిఆర్‌పిలు శివకుమార్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## మనూర్ జడ్పీహెచ్ఎస్‌లో రైజింగ్ శిక్షణ కేంద్రం

**మనూర్, ఏప్రిల్ 25, ప్రభాతార్త:** మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన తెలంగాణ రైజింగ్ ఉచిత శిక్షణ కేంద్రాన్ని శుక్రవారం అధికారులు ప్రారంభించారు. శిక్షణ కేంద్రంలో విద్యార్థులకు మనోవికాసం పెంపొందించడానికి సంగీతం,శాస్త్రీయ నృత్యం, చిత్ర లేఖనం, వ్యక్తిగత వికాసం, కుట్లు, అల్లికలు, చదరంగం, ఇండోర్ గేమ్స్, పిఎల్ఎం తయారీ కథలు, యోగా ధాన్యంలపై శిక్షణ కల్పిస్తారన్నారు. జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి, జిల్లా విద్యాధికారి సుంకేసుల వెంకటేశ్వర్లు రూపకల్పన చేసిన శిక్షణ మే 15 వరకు కొనసాగుతాయని, విద్యార్థులు శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని ఎంఈఓ రాజశేఖర్ శెట్కార్, తహసీల్దార్‌విష్ణు సాగర్, ఎంపిడిఓ హైమద్ హుస్సేన్, ప్రధానోపాధ్యాయులు రాజు, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు రాఘవచారి జోషి, జూనియర్ అసిస్టెంట్ ఖాజామొయినుద్దీన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## పహెల్గాం మృతులకు ఘన నివాళులు



బీరు పరిశ్రమలో పహెల్గాం మృతులకు నివాళులర్పిస్తున్న కార్మికులు

**చౌటకూరు, ఏప్రిల్ 25, ప్రభాతవార్త:** జమ్మూ కాశ్మీర్ పహెల్గాంలో ఉగ్రమూకల దాడిలో ఆసువులు బానిన వారికి మండల పరిధిలోని శివంపేటలోని బీరు పరిశ్రమలో కార్మికులు కొవ్వొత్తులు వెలిగిని మృతులకు నివాళులు అర్పించారు. 26 మందిని బలికొన్న ఉగ్రవాదులను పట్టుకుని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పరిశ్రమ ప్లాంట్ హెడ్ దీక్షిత్, పరిశ్రమ యూనియన్ గౌరవ అధ్యక్షులు పి బాగారెడ్డి, నాయకులు ఏర్పుల నాగభూషణం, మల్లారెడ్డి, విష్ణువర్దన్‌గౌడ్ గోపాల్, వెంకటేవం, విఠల్ తదితరులు పాల్గొన్నారు.

## నర్సాపూర్‌లో తాగునీటి సమస్య పరిష్కారం

### ఎమ్మెల్యే సునీతారెడ్డి



పైపులైన్ల పనులకు శంకుస్థాపన చేసిన ఎమ్మెల్యే సునీతారెడ్డి తదితరులు

**నర్సాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త:** పట్టణంలో అమృత్ పథకంలో రెండు వాటర్‌ట్యాంక్‌లు, పైప్‌లైన్ నిర్మాణంతో శాశ్వతంగా తాగునీటి సమస్య పరిష్కారం అవుతుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. శుక్రవారం ఆమె వాటర్‌ట్యాంకులు, పైపులైన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. తాగునీటి ఎద్దడిని తీర్చాలని మాజీ మున్సిపల్ చైర్మన్ దుర్గప్పగారి అశోక్‌గౌడ్ వినతి మేరకు ఎమ్మెల్యే సునీతారెడ్డి సహకారంతో అన్ని వార్డుల్లో తాగునీటి ఎద్దడిని నివారించడానికి అమృత్ పథకంలో రెండు వాటర్ ట్యాంకులను, పైప్‌లైన్‌లను నిర్మిస్తున్నారు. అనంతరం సునీతారెడ్డి మాట్లాడుతూ వాటర్ ట్యాంకులు, పైప్ లైన్ ఏర్పాటుతో నర్సాపూర్ పట్టణంలో తాగునీటి సమస్య శాశ్వతంగా పరిష్కారం అవుతుందన్నారు. ఈ పనులను త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే సునీతారెడ్డి సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ రామకృష్ణారావు, ఏఈ కిష్టయ్య, బిఆర్ఎస్ నాయకులు సత్యంగౌడ్, పట్టణ అధ్యక్షుడు పంబాల బిక్షపతి, మండల అధ్యక్షుడు శేఖర్, బిఆర్ఎస్ నాయకులు సూరారం నరసింహులు, వెంకట నర్సింగరావు, బాల్‌రెడ్డి, విట్టల్, శివకుమార్, జ్ఞానేశ్వర్‌గుప్త, రింగుల ప్రసాద్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రెండు బైకులు ఢీకొని ఇద్దరు దుర్మరణం

**నర్సాపూర్, ఏప్రిల్ 24, ప్రభాతవార్త :** రెండు బైకులు ఢీకొని ఇద్దరు వ్యక్తులు మృతి చెందిన సంఘటన గురువారం రాత్రి నర్సాపూర్ సంగారెడ్డి వెళ్లే రోడ్డు మార్గంలోగల ఇండియన్ ఆయిల్ పెట్రోల్ పంప్ సమీపంలో జరిగింది. ఎస్సై లింగం కథనం ప్రకారం ..సంగారెడ్డి జిల్లా చౌటకూర్ గ్రామానికి చెందిన ఎల్ల పొల్ల బాలరాజ్(32) ఈనెల 24న బైక్ పై అల్వాల్ నుండి సొంత గ్రామం చౌటకూర్‌కు వెళుతుండగా ఈ క్రమంలోనే నర్సాపూర్ పట్టణానికి చెందిన చింతకుంట నవీన్ (26) తన బైక్ పై దౌల్తాబాద్ నుండి నర్సాపూర్ వస్తున్న క్రమంలో రాత్రి సమయంలో అతివేగంగా అజాగ్రత్తగా నడుపుతూ ఎదురుగా వస్తున్న చౌటకూర్ బాల్ రాజ్ బైక్ కు బలంగా ఢీ కొట్టింది. దీంతో ఇద్దరు రోడ్డుపై పడగా తీవ్ర రక్త గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదంలో బాలరాజు అక్కడికక్కడే మృతి చెందగా. తీవ్ర గాయాలతో రక్తసిక్తమైన చింతకుంట నవీన్ ను మెరుగైన చికిత్స కోసం హైదరాబాదులోని గాంధీ ఆసుపత్రికి తరలించారు అక్కడి డ్యూటీ డాక్టర్ పరీక్షించి చింతకుంట నవీన్ సైతం మృతి చెందాడని తెలిపారు. అతివేగంగా అజాగ్రత్తగా నడిపి రెండు బైకులు ఎదురెదురుగా వచ్చి ఢీకొనగా ఇద్దరి వ్యక్తులు దుర్మరణం చెందారు. మృతుడు చౌటకూర్ ఎల్లపల్లి బాలరాజ్ కు భార్య సుమలత, ఇద్దరు పిల్లలు కూతురు ప్రత్యూష (13) కొడుకు కార్తీక్(10) లు ఉండగా మరో మృతుడు నర్సాపూర్ కు చెందిన చింతకుంట నవీన్ కు ఇంకా వివాహం జరగలేదని తెలిపారు. మృతుడు బాలరాజ్ భార్య సుమలత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై బి లింగం తెలిపారు.